ప్రాయముగనో గానవచ్చుచున్నది. ఉత్కర్షావహమగుటచే నీపాటి స్వాతంత్ర్యము ప్రశంసింపఁదగినదనియే నా తలంపు. నైషధమున శ్రీనాథుఁడునైతము కొన్ని సీసములలో నిట్టి వివరణము కావించియుండెను. విస్తరభీతిచే నిం దుదాహరణముల నీయనైతిని గాని వలయువా రాసీసములను మూల శ్లోకములతోఁ బోల్చి చూచిన నీవిషయము తేటతెల్లమగు

సంస్కృత వేణీసంహారమునందలి శైలి ప్రాయికముగా దీర్ఘసమాసభూయిష్టమును నోజోగుణసంపన్నమునై యలరారుచుండును. దర్శనైక ప్రయోజనములగు నాటకములం దిట్టిశైలి యంతగా నభిలషణీయము కాకపోయినను రసభావసన్నివేశములతోడియానుగుణ్యమునుబట్టి కొన్నియెడల నుచితముగాఁ గానిపింపకపోదు. వీరోచితాలాపములసందర్భమున సమాసభూయిష్ఠమైన రచన మిక్కిలి సరసమును శక్తిమంతమునై గోచరించును. శ్రీ వేంకటేశ్వరులుగారు మూలమునందలి గాంభీర్యమున కెచ్చటను గొఱంత రాకుండ ననవసర పదాడంబరముపొంత పోకుండ, రసభావానుగుణమైన శైలి నుపయోగించి యనువాదమును సరససుందరము కావించినారు. అనువాదము చేయునెడఁ దఱచుగా మూలపదముల యొక్కయుఁ దద్వ్యాఖ్యానపదముల యొక్కయుఁ బ్రభావము హెచ్చుగాఁ జూపట్టుట సహజము. అట్టి యెడ ననువాద భాషకు నిసర్గమైన నుడికారపు సొంపునకును జాత్యమునకును

అర్జునుఁడు జయద్రథునిఁ జంపఁదలఁచుట యనుయత్న
మును గలిసి ప్రతిముఖసంధియై కథను వృద్ధిపఱచుచున్నది.
తృతీయాంకమందలి యశ్వత్థామ పితృశోకము, కర్ణాశ్వత్థా
మల కలహము, చతుర్థాంకమందలి సుందరకుని యుద్ధవర్ణ
నము ప్రస్తుతకథ కప్రస్తుతములైన పతాకలు. చతుర్థాంకము
చివర తెరవెనుక దుశ్శాసనుఁడు తనచేతిలోఁ బడి చిత్రవధ
నందె ననుభీముని వాక్యములు, దుశ్శాసన రక్తమును భీముఁడు
పానముచేయుచుండె నను అశ్వత్థామవాక్యములు ప్రాప్త్యా
శతోఁ గూడి గర్భసంధి యగుచున్నది. పంచమాంకమున
ధృతరాష్ట్ర సంధియత్నము, షష్ఠాంకమందలి చార్వాక
ప్రవర్తనము ప్రకరి యగును. భీముని ప్రతిజ్ఞాపర్యవసాన
ముగా దుర్యోధనుఁడు మాయమగుట నాయకుని నియతా
ప్తిని సందిగ్ధావస్థలోఁ బెట్టుచు విమర్శసంధి యగుచున్నది.
చార్వాకవృత్తాంతము అద్భుతరసమును నిర్వహించినది.
పాంచాలకుఁడు దుర్యోధనుఁడు కనఁబడెనని చెప్పుటయు
భీమవిజయసూచకముగా విజయోత్సవమును గూర్పుఁడని
యుధిష్ఠిరుఁడు కాంచినవార్తవలనను తుదకు భీముఁడు
దుర్యోధనునిఁ జంపి ప్రతిజ్ఞాంబుధిని దాటితి నని చెప్పు
కార్యము, ద్రౌపదీ వేణీమహోత్సవ మను ఫలాగమముతోఁ
గూడి నిర్వహణసంధి లేక ఉపసంహృతిసంధి యగుచున్నది.

ఈవిధముగా వేణీసంహారనాటకమున ముఖ, ప్రతిముఖ,
గర్భ, విమర్శ, నిర్వహణ లేక ఉపసంహృతు లనునైదుసంధు

ఫలానుభవము నందినవాఁ డగుటను, భరతవాక్యముఁ బలికినవాఁ డగుటను యుధిష్ఠిరుఁడే నాటకనాయకుఁ డనక తప్పదు. ఆతనిబలహీనతలుగాఁ గాననగుగుణములులోతుగాఁ బరిశీలించినచో, నాతని యుదారతాదయాగుణానుభూతులే కాని యన్యములు కావు. కావున నాటక నాయకుఁడు యుధిష్ఠిరుఁడే యనఁ జెల్లును.

## 6. వేణీసంహారము : ఆంధ్రీకరణములు.

వేణీసంహారమును ప్రథమముగా కీ. శే. కోరాడ రామచంద్రశాస్త్రిగా రాంధ్రీకరించి రని తెలియుచున్నది. కాని, యదియముద్రితమగుట నెవ్వరికిని దెలియదు. దీనిని 1883లో నాంధ్రీకరించి క్రీ.శ.1886 సంవత్సరము ప్రకటించిన వారు కీ. శే. వడ్డాది సుబ్బారాయుఁడుగారు. వారి యాంధ్రీకృతిపై గొప్పవిమర్శను వెలువరించి యావిమర్శానుసారము తామాంధ్రీకరించి చూపుఁడని ప్రజలుకోరుటచేఁ దరువాత మహామహోపాధ్యాయ, కవిసార్వభౌమ (ఆస్థానకవి) శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు దీని ననువదించి ప్రకటించిరి. పై యిరువురు ఉద్దండపండితులు. ఐనను, వడ్డాది వారియనువాదము పలుతావుల మూలము నతిక్రమించినది; కొన్నిచోట్ల నపార్థము చేసికొన్నది. కాని, వారియనువాదము పలుమఱు పలుతావులఁ బ్రదర్శింపఁబడి యాంధ్రదేశమున గొప్పకీర్తి గడించినది. ఐదాఱుముద్రణము లందినది. ఆ నాటకప్రదర్శ

నములలో సుబ్బారాయఁడుగారు యుధిష్ఠిరపాత్ర ధరించి చక్కఁగ నొప్పించెడువారఁట. శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారు జగదేకపండితులు, మహాకవులు, సద్విమర్శకులు. వారియనువాదము మూలాతివిధేయము. నాయనువాదము పీఠికలో డా॥ అవధానిగా రన్నట్లు మూలాతివిధేయము కాదు, మూలావిధేయమును గాదు. నేను దీని ననువదించి 1951 సంవత్సరమునఁ బ్రకటించితిని. అపుడు వ్రాసిన నాంది కోశాంతరగతము. పూర్వకవు లెల్లరు చదివిన 'నిషిద్ధైరపి' మున్నగు శ్లోకములు గలనాంది ననువదింపకపోవుట లోపమే యని పెద్దలు సూచించిరి. వారి సూచన తలధరించి రెండు విధముల నాందీక్రమము ననువదించి యీ ముద్రణమునఁ జూపితిని. దీని కాదరమునఁ బీఠిక వ్రాసిన డా॥ అవధాని గారికిని, హార్దాభినందన లందిచ్చిన శ్రీమాన్ అనంతకృష్ణశర్మ గారికిని, తమయాదరాతిశయమును జూపినయితరమిత్రులకును నేను మిక్కిలి కృతజ్ఞుఁడను.

విధేయుఁడు,

బులుసు వేంకటేశ్వరులు.

అస్త్రమున రార! రాఁజాలవైతివేని
శరము ధర నిడి తాల్పు మంజలిని మౌళి. ౩౯

(ఇరువురును గత్తులుదూసి కలియఁబడఁబోవ దుర్యోధనకృపులు వారింతురు.)

దుర్యో :—సఖా ! గురుపుత్త్రా ! శస్త్రమును ముట్టకు.

కృపు :—వత్సా ! సూతపుత్రా ! శస్త్రమును ముట్టకు.

అశ్వ :—మాతులా ! ఏల వారింతువు? తండ్రిని నిందించుటచే సూతకులాధముఁడు నాకు ధృష్టద్యుమ్నసమానుఁడే.

కర్ణ :— రాజా ! నివారింపకు.

అశ్వ :—రాజా ! రానిమ్ము. రానిమ్ము. వీనిని నాసందిట నిఱికించుకొని నలిపివైచెదను. ఓయీ ! కౌరవేశ్వరా ! స్నేహముననో కార్యముననో నాతండ్రిని గాఱులుకూసిన యీ దురాత్ముని దుర్మదుని గాపాడఁ గోరుచుంటివి. నీ కీరెంటను నిరుపయోగమే. ఏలన !

గీ. సుగుణవంతుఁడ వీవు; ఈశుంఠ పాపి;
ఇందుకులుఁడవు నీ వౌదు; వితఁడు సూత
సంభవుఁడు; మైత్రి యెట్లు పొసంగుమీకు ?
ఇల సకర్ణార్జున మొనర్తు నిప్పుడె నేను. ౪౦

(నలుఁబోవును.)

కర్ణు :— (కత్తి దూసి) వృథాచపలబ్రాహ్మణా ! ఇఁక నీ వుండవురా. రాజా ! విడువుము. విడువుము. సన్నిఁక వారింపకుము. ఏలన !

గీ. ధీరసత్త్వుఁడు జడు నవధీరణమునఁ
గోపమును మిగిలించి సైరింపఁ; గూళయగుట

